కారు ఢీకొని వృద్ధ దంపతులకు తీవ్రగాయాలు

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధ దంపతులను ఢీకొన్న కారు

చందుర్తి, డిసెంబర్ 26: ఓ గుర్తు తెలియని కారు ఢీకొనడంతో వృద్ధ దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కట్టలింగంపేటకు చెందిన వృద్ధ దంపతులు మల్లారపు పోశయ్య, మల్లవ్వ వ్యవసాయం పనుల కోసం బావి దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, బ స్టాండ్ సమీపంలో కోరుట్ల నుంచి వేములవాడ వైపు వస్తున్న ఓ గుర్తుతెలియని కారు ఢీకొన్నది. దీంతో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కరీంనగర్‌లోని ఒక దవాఖానకు తరలించారు.

రాములోకి అక్షింతల శోభాయాత్ర

రుద్రంగిలో అయోధ్య అక్షింతలు ఉన్న కలశాలను పల్లకీలో ఊరేగిస్తున్న జడ్పీటీసీ, సర్పంచ్, గ్రామస్తులు

రుద్రంగి, డిసెంబర్ 26: అయోధ్య రాములోరి అక్షింతలు మంగళవారం రుద్రంగి చేరుకోగా జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగా రం, సర్పంచ్ తర్రె ప్రభలత, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగ తం పలికారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి అయోధ్య అక్షింతలు ఉన్న కలశాలను పల్లకీలో ఉంచి పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఇక్కడ నాయకులు తర్రె మనోహర్, మంచె రాజేశం, కొమురె శంకర్, దయ్యాల కమాలాకర్, చెప్యాల గణేశ్, గొళ్లెం నర్సింగ్, నంద్యాడపు వెంకటేశ్, రాసురి నర్సారెడ్డి, మంచె రమేశ్, సామ మోహన్‌రెడ్డి, సూర యాదయ్య, మనోజ్, గండి నారాయణ, లింగం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 26: అయోధ్య రాములోరి అక్షింతలు బొప్పాపూర్, నారాయణపూర్ గ్రామాలకు మంగళవారం చేరుకోగా, భక్తులు శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బొప్పాపూర్, నారాయణపూర్‌లో పురవీధుల గుండా భక్తులు రామ నామ జపం చేస్తూ ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఎంపీటీసీ ఇల్లెందుల గీతాంజలి, భక్తులు, తదితరులు ఉన్నారు.

అగ్రహారం అంజన్న హుండీ లెక్కింపు

అగ్రహారం ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ రూరల్, డిసెంబర్ 26 : వేములవాడ మండలం అగ్రహారం అంజన్నకు హుండీ ద్వారా రూ.4.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎండపల్లి మారుతి పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరిశెట్టి మహేందర్, ఆలయ మాజీ ధర్మకర్త చేపూరి నాగరాజు, పెద్దపల్లి డివిజన్ పరిశీలకులు సుజాత సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టామని ఈవో తెలిపారు. ఇక్కడ అర్చకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంకుసాపూర్ సందర్శన



అంకుసాపూర్‌లో విత్తనాలను పరిశీలిస్తున్న సింగ్ విండో చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లు

కోనరావుపేట, డిసెంబర్ 26: నిజామాబాద్ జిల్లాలోని అంకుసాపూర్ గ్రామాన్ని కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విత్తనాల తయారీ, పాడి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంకుసాపూర్‌లో రైతులు పండిస్తున్న పంటల తీరు అద్భుతమని కొనియాడారు. ఈ గ్రామాన్ని రైతులు సందర్శించాలని తెలిపారు. ఇక్కడ సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, డైరెక్టర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సుధాకర్ కుటుంబానికి నగదు అందిస్తున్న మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 26: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వంకాయల సుధాకర్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత కోడి అంతయ్య మంగళవారం పరామర్శించారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. అనంతరం సదరు కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ మాజీ ఎంపీటీసీ కర్నె బాలయ్య, మోతె మహేశ్, తాటిపాముల శ్రీనివాస్‌గౌడ్, గొడిశెల ఎల్లయ్య, బాలసాని శ్రీనివాస్, బాలసాని పరశురాములు, దేవయ్య ఉన్నారు.

'ప్రజా పాలన' కట్టుదిట్టంగా నిర్వహించాలి

- ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు నిర్వహణ
- ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో గ్రామ సభలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజాపాలన సన్నాహక ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, డిసెంబర్ 26: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలు కట్టుదిట్టంగా నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం ఆయన సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యానాయక్, పూజారి గౌతమితో కలిసి ప్రజాపాలన సభలకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు పని దినాల్లో జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రతి మండల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూళ్లలో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. ప్రజాపాలన నిర్వహణపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సభల నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, టెంట్, కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి వంద కుటుంబాలకొక కౌంటర్ కేటాయించాలన్నారు. మహిళలు, వయోవృద్ధులు, దివ్యాంగులకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు స్వీకరించాలని, ఆధార్, రేషన్‌కార్డు జతచేసేలా చూడాలన్నారు. ప్రతి దరఖాస్తు స్వీకరించి, రసీదు అందించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి మాట్లాడుతూ, మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, దరఖాస్తుదారులు ముందస్తుగా ఫాం నింపుకొని సభకు వచ్చేలా చూడాలన్నారు. గ్రామసభ నిర్వహణపై డప్పుచాటింపు ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కరోనా వ్యాప్తిస్తున్న దృష్ట్యా అధికారులు గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద భౌతిక దూరం పాటించేలా చూడాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని గ్రామాల్లో సభలు ఏర్పాటు చేశారు.. ఎన్ని దరఖాస్తులు వచ్చాయో రిపోర్టు రోజువారీగా తమకు పంపాలని డీపీవో రవీందర్ సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, జడ్పీసీఈవో గౌతంరెడ్డి, డీటీవో కొండల్‌రావు, పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- 'ప్రజా పాలన'లో దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడ గుడి చెరువు నుంచి పంట పొలాలకు నీటి విడుదల

వేములవాడ గుడి చెరువు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఈఈ అమరేందర్‌రెడ్డి

వేములవాడ, డిసెంబర్ 27: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేములవాడ పట్టణ గుడి చెరువు ఆయకట్టుకు నీటిని విడుదల చేసి మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే జలయజ్ఞంలో భాగంగా నియోజకవర్గంలో 90 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఎల్లంపల్లి ఎత్తిపోతల పనులకు రూ.1,737కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఫాజుల్‌నగర్, నర్సింగాపూర్, రుద్రంగి, నాగారం చెరువులను రిజర్వాయర్లుగా మార్చి మల్యాల మధ్యలో పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కలికోటమ్మ సూరమ్మ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, పింఛన్ల కోసం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించే ప్రజా పాలన సభల్లో అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈఈ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఆయకట్టు కింద 140ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్నందున పంటలకు నీరందిస్తున్నామని చెప్పారు. ఇక్కడ ఇరిగేషన్ డీఈ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, పులి రాంబాబు, తోట రాజు, కనికరపు రాకేశ్, కొమరయ్య ఉన్నారు.

28న మినీ జాబ్ మేళా

వేములవాడ రూరల్, డిసెంబర్ 26 : వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి నీల రాఘవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి కల్పనశాఖ, డిగ్రీ కళాశాల అగ్రహారం ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కల్పన కోసం నిర్వహించే జాబ్‌మేళాకు నిరుద్యోగులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్, జిరాక్సులతో హాజరు కావాలని తెలిపారు. 28న ఉదయం 10గంటలకు కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉం టుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుటుంబమంతా తిరుపతికి.. దొంగలు ఇంట్లోకి..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
- సెల్‌ఫోన్ దొంగతనం

కోనరావుపేట, డిసెంబర్ 26: ఆ కుటుంబమంతా తిరుపతి దైవ దర్శనానికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన దొంగలు రాత్రివేళ ఇంట్లో చొరబడ్డారు. వస్తువులను చిందరవందరగా పడేసి సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య తన కొడుకు వివాహం కోసం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. కొడుకు పెళ్లి తర్వాత ఈనెల 21న కుటుంబమంతా కలిసి తిరుపతికి వెళ్లారు. దీంతో సోమవారం రాత్రివేళలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి ఇంట్లో ఉన్న బీరువాతోపాటు వస్తువులను చిందరవందర చేశారు. మంగళవారం వేకువజామున చుట్టుపక్కల వారు గమనించి పోలీసులు, కుటుం బ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ రఘుపతిరెడ్డి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించా రు. విలువైన వస్తువులు దొరక్కపోవడంతో ఒక సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అంజయ్య ఇంటికి చేరుకున్న తర్వాత వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

- సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు

గంభీరావుపేట, డిసెంబర్ 26: వినియోగదారుల సమస్య పరిష్కారానికి సెస్ కృషి చేస్తామని సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు పేర్కొన్నారు. నర్మాలలో మంగళవారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. గ్రామంలో లూజ్ లైన్లు లేకుండా 15మిడిల్ స్తంభాలు ఏర్పాటు చేసి, వినియోగదారులకు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడబోయిన రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, ద్యానబోయిన రాజేందర్, కిశోర్, రాజేందర్, రాజేశ్వర్‌రావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లపైనే 'తెల్ల' బంగారం

మండల వ్యాప్తంగా పంట చేలలో పత్తి చెట్లపైనే ఉన్నది. పత్తి ఏరడానికి కూలీలు దొరకపోవడంతో పంట చేలన్నీ కనుచూపు మేర తెల్లబంగారంతో నిండిపోయాయి. ఈసారి పత్తి పంటలో అసలు దిగుబడి రాక అన్నదాతలు ఓవైపు అవస్థలు పడుతుంటే.. కూలీలు పత్తి ఏరేందుకు కిలోకు రూ.10 నుంచి 12 వరకు ఇస్తామన్న రావడం లేదు. మరోవైపు వరి నాట్లు వేయడంలో బిజీగా ఉండడంతో కూడా కూలీలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో చేలన్నీ తెల్ల బంగారంతో నిండిఉన్నాయి.

-కోనరావుపేట, డిసెంబర్ 26

మామిడిపల్లి గ్రామ శివారులో తీసేందుకు సిద్ధంగా ఉన్న పత్తి చేను

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు

ఇల్లంతకుంట, డిసెంబర్ 26: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పొత్తూరు గ్రామంలో సీపీఐ నాయకులు ఎర్ర జెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ సీపీఐ జిల్లా నాయకులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, భూంపెల్లి భూంరెడ్డి, గుంటి బక్కయ్య, మందాటి గోపాల్‌రెడ్డి, దామెర కొమురయ్య, పండుగ యాదయ్య, మల్లేశం, దేవయ్య, తదితరులు ఉన్నారు.

వేములవాడలో..

వేములవాడ, డిసెంబర్26: సీపీఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను నాయకులు మంగళవారం వేములవాడలో నిర్వహించారు. మొదటి బైపాస్ రహదారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు జెండాను ఆవిష్కరించారు. ఇక్కడ సీపీఐ పట్టణ కార్యదర్శి తెల్ల దేవరాజ్, నాయకులు గాజుల పోశెట్టి, పండుగ పోచమ్మ, వావిలాల మల్లేశం, శాంత, పండుగ చంద్రయ్య, పరశురాములు, మల్లేశం ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామివారి ఊరేగింపు

అయ్యప్ప స్వామివారిని ముస్తాబాద్ పురవీధుల్లో ఊరేగిస్తున్న మాలధారులు

ముస్తాబాద్, డిసెంబర్ 26: మండల కేంద్రంలోని ధర్మశాస్త్రనగర్‌లో గల హరిపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 27న మహా పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మంగళవారం మహా గణపతి హోమం, అభిషేకం జరిపించారు. తర్వాత స్వామివారిని ముస్తాబాద్ పురవీధుల్లో ఊరేగింపు, తిరువాభరణ పూజ, స్వామివారు భక్తుల శరణు జోషతో ఆలయ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపులో భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు మంగళహారతులతో స్వామివారి స్వాగతం పలికారు.

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 26: అల్మాస్‌పూర్‌లో హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మహాపడి పూజను మంగళవారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీలో స్వామి వారి ఆభరణాలను అయ్యప్ప మాలధారుల భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ శ్రీను గురుస్వామి, మాలదారులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



వరదవెల్లిలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు

వేములవాడ టౌన్, డిసెంబర్ 26 : దత్తజయంతి సందర్భంగా మంగళవారం వేములవాడ పట్టణంలోని పారువెళ్ల సావిత్రమ్మ స్వగృహంలో దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. దత్త నవరాత్రుల సందర్భంగా తొమ్మిదిరోజులపాటు ఇక్కడ దత్తనవరాత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అర్చకులు శ్రీనివాస్ దత్తాత్రేయుడికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దత్తాత్రేయునికి అభిషేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో కుంభకోణం వనజ, రాజన్న, అనూరాధ, సత్యనారాయణ, సుమహిళ, శ్రీకాంత్, సంగనభట్ల సీమ, నిజాం శ్రీదేవి, నరేందర్, దివ్య, సునీల్ పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో 'సుంకె'

బోయినపల్లి, డిసెంబర్ 26: బోయినపల్లి మండలం దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేసి జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. యేటా జరిగే జయంత్యుత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు వరదవెల్లిలో గుట్టపై దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం ఆలయాలకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందన్నారు. తెలంగాణ సంప్రదాయానికి ప్రత్యేక ఆదరణ తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్, సర్పంచ్ ఆరెపల్లి లత, ఎంపీటీసీ రాజేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కల్తీని అరికట్టేందుకు చర్యలు

గొల్లపల్లిలోని కల్లు దుకాణంలో షాంపిల్ సేకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 26: మద్యం, కల్లు దుకాణాల్లో కల్తీని అరికట్టేందుకు నిత్యం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బొప్పాపూర్, గొల్లపల్లి, లింగన్నపేట, గంభీరావుపేటలోని మద్యం, కల్లు దుకాణాల్లో తనిఖీలు చేయించారు. ఇక్కడ సిబ్బంది మల్లేశ్, కిశోర్‌కుమార్, దివ్య ఉన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక

తెలంగాణ చౌక్, డిసెంబర్ 26: ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ ఎంపికైనట్లు డీఎస్‌వో దేవయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 17 నుంచి 20వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ సైన్స్ టీచర్స్ వర్కషాప్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రయోగాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో కీలకమైన అంశాలు, సైన్స్ బోధనలో వినూత్న, సృజనాత్మక పద్ధతుల ఆవిష్కరణపై సందేశాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి సెమినార్‌కు ఉపాధ్యాయుడు ఎంపిక కావడంపై విద్యాశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

సంపత్‌కుమార్

హామీలు అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 26: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతినెల 5వ తేదీలోగా దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలుపుకోవాలని జిల్లా దివ్యాంగ సమితి జిల్లా అధ్యక్షుడు దొంతినేని చంద్రరావు మంగళవారం డిమాండ్ చేశారు. దివ్యాంగులకు పెంచిన పింఛన్ అమలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో బస్ పాస్‌తో సంబంధం లేకుండా ఉచిత ప్రయాణ వసతి కల్పించాలని కోరారు. సకాలంలో పింఛన్ అందించాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గంభీరావుపేట, డిసెంబర్ 26: నర్మాలలో ఆరుగురు లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ ఎడబోయిన రాజు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇక్కడ సింగిల్‌విండో డైరెక్టర్ పురం రాజేశ్వర్‌రావు, వార్డు సభ్యులు లచ్చయ్య, ధర్మేందర్, సయ్యద్ పర్వీన్, తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్‌కు మాతృవియోగం

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 26: సిరిసిల్లలోని రెండో వార్డు కౌన్సిలర్ రాపెల్లి దినేశ్ తల్లి రాపెల్లి రాధమ్మ మంగళవారం మృతి చెందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి శాంతినగర్‌లోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ అడ్డగట్ల మాధవి, నాయకులు అడ్డగట్ల మురళి, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మ్యాన రవి, తదితరులు ఉన్నారు.

ప్రజా సేవకుడిగా మీ మధ్యలోనే ఉంటా

కోనరావుపేట, డిసెంబర్ 26: మీకు సేవకుడిగా పనిచేస్తూ మీ మధ్యలో ఉంనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, కనగర్తి, సుద్దాల గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించగా హాజరయ్యారు. ప్రధాన కూడళ్లలోని సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఇక్కడ సర్పంచ్ కేతిరెడ్డి అరుణరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, గ్రామాధ్యక్షుడు లంబ రాజు, నాయకులు ఉన్నారు.

సరైన పత్రాల్లేకుండా వాహనాలు నడుపరాదు

వేములవాడ రూరల్, డిసెంబర్ 28 : సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపరాదని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ పరిధిలోని పోచెట్టిపల్లి గ్రామపరిధిలో ఆటో ప్రమాదం జరుగగా చింతల్ ఠాణా గ్రామానికి చెంది ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఆటో ప్రమాదానికి కారణమైన రాజును అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో వేములవాడ రూరల్ సిబ్బంది ఉన్నారు.

ఆలయాలకు ప్రత్యేక విశిష్టత

బోయినపల్లి, డిసెంబర్ 26 : తెలంగాణలోని ఆలయాలకు ప్రత్యేక విశిష్టత ఉన్నట్లు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని వరదవెల్లిలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో బోటులో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల బీజేపీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విహార యాత్రకు విద్యార్థులు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 26: క్రిస్మస్ సెలవులను పురస్కరించుకొని పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విహార యాత్రకు వెళ్లినట్లు హెచ్ఎం భాగ్యరేఖ తెలిపారు. హన్మకొండలోని వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళీ దేవాలయం, రామప్ప గుడి, లక్నవరం చెరువుతోపాటు పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించినట్లు చెప్పారు. ఇక్కడ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పరమేశ్ ఉన్నారు.